క్లుప్తంగా

శేష వాహనంపై కామాక్షీదేవి



సంగం: మండలంలోని వంగల్లులోని కామాక్షీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆదిదంపతులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.

నేడు శ్రీచక్రచర మహామేరు ప్రతిష్ట

అనుమసముద్రంపేట: మండలంలోని చిరమనలో కొలువైన కామాక్షీదేవి సమేత చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం 8.30 గంటలకు శ్రీచక్రచర మహామేరు ప్రతిష్టను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మద్దూరు వజ్రమ్మ, నాగిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, నాగిరెడ్డి శ్రీలక్ష్మి బుధవారంతెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై చంద్రమౌళేశ్వరస్వామి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

గండార్పమ్మకు విశేష పూజలు

చేజర్ల: మండల కేంద్రమైన చేజర్లలోని గ్రామదేవత గండార్పమ్మ ఆలయంలో ప్రథమ వార్షిక వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గండార్పమ్మకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. గురువారం శాంతి హోమం, అన్నదానం, 17న మధ్యాహ్నం సామూహిక పొంగళ్లు, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వంటేరు సుధీర్‌కుమార్‌రెడ్డి, గడ్డం వెంకటరమణారెడ్డి తెలిపారు.

ఆర్‌ఎస్సార్‌లో అవగాహన సదస్సు

బిట్రగుంట: కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు మేథో హక్కులపై వర్చువల్ విధానంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చెన్నైలోని పేటెంట్ కార్యాలయానికి చెందిన పరమేష్ పేటెంట్ విధానాలు, మేథో హక్కులు, కాపీరైట్స్, ట్రేడ్‌మార్క్ రిజిస్ట్రేషన్, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సృజనాత్మకతను, ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం మేథో హక్కుల రక్షణకు కల్పించిన వెసులుబాట్లను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ పీవీఎస్‌రెడ్డి, సివిల్ విభాగం అధ్యాపకులు జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు నమూనా పరీక్ష

ఉదయగిరి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం నమూనా పరీక్ష నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఈ పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కేవీ కృష్ణ, మధు, సురేష్, తదితరులు పర్యవేక్షించారు.

గిరిజనులకు అన్నదానం



కావలి రూరల్: పట్టణ పరిధిలోని బుడంగుంట గిరిజన కాలనీలోని గిరిజనులకు హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. విశ్రాంత తహసీల్దార్ సిరాజ్ మొఘల్ దాతృత్వంతో 100 మంది గిరిజనులకు అన్నదానం చేసినట్లు హేపీ సేవాసంస్థ అధ్యక్షుడు ఘనీబాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి



వింజమూరు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ వింజమూరు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు కోరారు. ఈ మేరకు జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ చిరంజీవిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులకు సంబంధించిన సర్వీసు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు



ఆత్మకూరురూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ దేవసేన



సంగం: మర్రిపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా పారదర్శకంగా రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఆత్మకూరు ఏడీఏ దేవసేన పేర్కొన్నారు. మహిమలూరులోని సచివాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మేరకు రైతులకు గోనెసంచులు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఎఫ్‌డీఓ జారీ చేసిన రైతులకు కొనుగోలు కేంద్రం నుంచి మిల్లుకు తరలించే వరకు ధాన్యం రవాణా వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలుకు ముందు రైతుభరోసా కేంద్రాల వద్ద తేమ శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాలు నిర్ధారిస్తామని తెలిపారు. ధాన్యాన్ని మిల్లుకు తరలించిన తరువాత ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా ప్రభుత్వం తరుపున నియమించబడిన కస్టోడియన్ అధికారి, మండల స్థాయిలో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బంది పరిష్కరిస్తారన్నారు. ధాన్యం సమస్యలపై రైతులు మిల్లులకు వెళ్లాల్సిన అవసరంలేదన్నారు. రైతు విక్రయించిన ధాన్యం దూరంగా ఉన్న మిల్లులకు కేటాయించినప్పటికీ అందుకయ్యే రవాణా వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు విధానంలో సంస్కరణలు తెచ్చిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు దళారులకు అమ్ముకున్నా ప్రభుత్వానికి అభ్యంతరంలేదని, ఆ వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని కోరారు. ఏఓ కిషోర్‌బాబు, సివిల్ సప్లయ్స్ డీటీ శ్యామలాదేవి రైతులకు సూచనలు చేశారు. మహిమలూరు సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, వీఆర్వో సూరిపోగు కృష్ణయ్య, మహిమలూరు, రామస్వామిపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర

సంగం: మర్రిపాడు రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎస్ శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం క్వింటాకు ఏ గ్రేడ్ రకానికి రూ.2,060, పుట్టికి రూ.17,510, సాధారణ రకానికి క్వింటాకు రూ.2040, పుట్టికి రూ.17,540 వంతున మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయానికి రైతులు ఈక్రాప్, ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. మర్రిపాడులో 96 శాతం ఈ క్రాప్ నమోదు పూర్తయిందని తెలిపారు. తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, సర్పంచ్ సురేష్, వీఆర్వో కొండ శ్రీనివాసులు, వీఏఏ జీ వెంకట సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మొగిలిచర్ల తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు



ఉదయగిరి: మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎం కరిమున్నీసా



కావలి: మాట్లాడుతున్న డీఎం ఆర్ శ్రీనివాసులు

కావలి రూరల్ : ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి తిరునాళ్లకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం కావలి నుంచి మొగిలిచర్లకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని కావలి డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. కావలి నుంచి సాయిపేట, లక్ష్మీపురం మీదుగా 10, కొమ్మి, కొండాపురం మీదుగా 8, కలిగిరి మీదుగా 7 సర్వీసులు నడుపుతున్నామని వివరించారు. కావలిలోని పెద్దపవని బస్టాండ్, కలిగిరి, కొండాపురం, సాయిపేట, లింగసముద్రం, తాతాహోటల్, మొగిలిచర్లలో తాత్కాలిక స్టాండ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు బస్సు సర్వీసుల సమాచారం అందించేందుకు ఆర్టీసీ సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. భక్తులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడకుండా ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు

ఉదయగిరి: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థంగా ఉదయగిరి డిపో నుంచి 22 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామని ఉదయగిరి డిపో ఇన్‌చార్జి మేనేజర్ షేక్ కరిమున్నీసా తెలిపారు. బుధవారం ఆమె డిపోలో యూనియన్ నేతలు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఉదయగిరి-సిద్దేశ్వరం 6, ఉదయగిరి-భైరవకోన 6, సిద్దేశ్వరం-సీతారామపురం 3, సీతారామపురం-భైరవకోన 3, పోరుమామిళ్ల-కోయిలంపాడు 4 చొప్పున బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఎస్టీఐ రామకృష్ణ, సూపరిండెంటెంట్ నారాయణరావు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీలు ప్రారంభం



పరుగు పందెంలో పోటీ పడుతున్న విద్యార్థినులు

వింజమూరు: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 98వ గ్రిగ్ మెమోరియల్ క్రీడాపోటీలను ఎంఈఓ మాలకొండారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల పరిధిలోని 37 ఉన్నత పాఠశాలలకు చెందిన 600 మంది క్రీడాకారులు క్రీడాపోటీలకు హాజరైనట్లు తెలిపారు. 50 రకాల క్రీడా పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 150 మంది క్రీడాకారులకు చివరిరోజు జ్ఞాపికలు, ధ్రువీకరణపత్రాలు అందజేయనున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ సుజన, హెచ్‌ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సురేష్

చేజర్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ అన్నారు. ఆదూరుపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంరక్షణకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు అమ్మాయిలు, 21ఏళ్లలోపు అబ్బాయిలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పొదలకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ అన్నపూర్ణ, సీపీఓ సమత, గురుకులం ప్రిన్సిపల్ శైలజాకుమారి, వైస్‌ప్రిన్సిపల్ నాగలలిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం జ్యోతిలక్ష్మి, సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సోమశిలలో వైఎస్సార్ టీఎఫ్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న రాణాప్రమోద్

ఆత్మకూరురూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. తూర్పురాయలసీమ ఉపాధ్యాయ స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా ఆయన తనయుడు రాణాప్రమోద్ ఆత్మకూరులో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డితో కలిసి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలుసుకుని తన తండ్రికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా ముద్రించిన క్యాలెండర్లను అందజేశారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, గంగాధర్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థిగా పోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతుగా కుమారుడు రాణాప్రమోద్‌రెడ్డి అనంతసాగరం మండలంలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వైస్‌ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమలరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు ఎం సుబ్బారెడ్డి, డానియేలు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను కలుసుకుని ఓట్లను అభ్యర్థించారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. పీడీఎఫ్ మద్దతు పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డి యూటీఎఫ్, ప్రజాసంఘాల నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు.

సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: ఉదయగిరి ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా పీ వంశీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటరమేష్ నిబంధనలకు విరుద్ధంగా ఓ డాక్యుమెంట్ రిజిష్టర్ చేసిన నేపథ్యంలో రెండ్రోజుల క్రితం ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో అల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వంశీకృష్ణను ఇన్‌చార్జిగా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి

ఉదయగిరి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నేలటూరు, శకునాలపల్లి సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పరామర్శ

జలదంకి: మర్రిపాడులోని నివాసంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బుధవారం కలుసుకుని పరామర్శించారు. చెన్నై అపోలో ఆస్పత్రిలో గుండె శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో వైస్‌ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, నాయకులు గుర్రం జగ్గయ్య, వట్టికాల బాలయ్య, అన్నారెడ్డి చంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

బ్రహ్మంగారి మఠానికి విగ్రహాల బహూకరణ



కొండాపురం: మండల కేంద్రమైన కొండాపురంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి మఠానికి దాతలు బ్రహ్మంగారు, గోవిందమ్మ, సిద్దయ్య పంచలోహ ఉత్సవ విగ్రహాలను బుధవారం బహూకరించారు. కావలికి చెందిన తియ్యబిండి బ్రహ్మానందం, అన్నవరపు బాలబ్రహ్మయ్య, ఒంగోలుకు చెందిన మరో దాత వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా విగ్రహాలను మఠం నిర్వాహకురాలు పుల్లమ్మకు అందజేశారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు మాధవాచారి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ఉదయగిరి: గండిపాళెం జలాశయం వద్ద ఉన్న సిద్దేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. నూతన విగ్రహాల గ్రామోత్సవం, యంత్రాలకు విశేషాభిషేకాలు, హోమాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పది మద్యం బాటిళ్ల పట్టివేత

మర్రిపాడు: మండలంలోని చిన్నమాచనూరులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఉదయగిరి సెబ్ ఎస్సై మురళీకృష్ణ తన సిబ్బందితో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దుత్తలూరు మండలం భైరవరానికి చెందిన చీమల రమణమ్మ వద్ద పది బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితురాలిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



ఆత్మకూరు: శివరాత్రి వేడుకలకు ముస్తాబైన కాశీనాయన ఆశ్రమంలోని కాళభైరవుడి కొండ



ఆత్మకూరు : కాశీనాయన ఆశ్రమంలో ప్రసాదాలను సిద్ధం చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, కాశీనాయన ఆశ్రమంలో మహాశివరాత్రి వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మహాశివరాత్రి సందర్భంగా అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేకువజామునే కాశీవిశ్వేశ్వరుడికి పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం శివ సహస్రనామార్చన చేయనున్నారు. మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణం, అన్నదానం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. కాశీవిశ్వేశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బొగ్గేరు సమీపంలోని కాశీనాయన ఆశ్రమంలో భారీ స్థాయిలో శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. ఆశ్రమ నిర్వాహకులు రామచంద్రయ్యస్వామి ఆధ్వర్యంలో భారీ చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. కాళభైరవ విగ్రహం ముందు కొండను రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఆశ్రమం ప్రాంగణంలోని ఉప ఆలయాలను రంగులతో ముస్తాబు చేశారు. ఆశ్రమాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శివరాత్రి రోజు భారీ స్థాయిలో అన్నప్రసాదం వితరణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణానికి చెందిన మహిళా భక్తులతో రెండ్రోజుల ముందు నుంచే ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. శివరాత్రి జాగారం చేసే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బైపాస్‌రోడ్డులోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి



ఆర్టీసీ సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్ఎం శేషయ్య

ఆత్మకూరురూరల్: ప్రజారవాణా సంస్థలో పని చేస్తున్న అన్ని స్థాయి ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని నెల్లూరు రీజనల్ మేనేజర్ శేషయ్య కోరారు. ఆత్మకూరు డిపోను బుధవారం ఆయన తనిఖీ చేశారు. డిపో మేనేజర్ కరీమున్నీసాతో కలిసి గ్యారేజీలో ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు అత్యధిక కేఎంపీఎల్ సాధించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. సమయాన్ని పాటించాలని, వ్యక్తిగత అభిప్రాయాలను తమ కార్యాచరణలో ప్రతిఫలించనీయవద్దన్నారు. అనంతరం బస్‌స్టేషన్ ప్రాంగణంలోని షాపులను తనిఖీ చేశారు. పరిపాలన కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. డిపో ఆవరణలో చేపట్టాల్సిన మరమ్మతులు, ఇతర నిర్మాణాలకు సంబంధించి అంచనాలు ఉన్నతాధికారులకు పంపించామని, త్వరలోనే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఏఎంఎఫ్ వర్మ, ఎంసీఓ శ్రీనివాసులు, గ్యారేజీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి కల్యాణమస్తు మంజూరు

జలదంకి: మండలంలో వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద ఆరుగురికి, షాదీతోఫా కింద ఒకరికి ప్రభుత్వ సాయాన్ని ఖాతాల్లో జమ చేశామని ఎంపీడీఓ ఎం శ్రీధర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణమస్తు పథకం కింద గట్టుపల్లి సచివాలయం పరిధిలో ఇద్దరు, జలదంకి-2 సచివాలయం పరిధిలో ఒకరు, జమ్మలపాళెం సచివాలయం పరిధిలో ఒకరు, చినక్రాక సచివాలయం పరిధిలో ఒకరు, సోమవరప్పాడు సచివాలయం పరిధిలో ఒకరు చొప్పున ఆరుగురికి సాయం అందించినట్లు వివరించారు. షాదీతోఫా కింద సోమవరప్పాడు సచివాలయం పరిధిలో ఒకరికి సాయం అందజేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల వివాహాలకు రూ.లక్ష, కులాంతర వివాహాలకు రూ. 1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, కులాంతర వివాహాలకు రూ.75 వేలు, మైనార్టీలకు రూ.లక్ష, దివ్యాంగులకు రూ. 1.50 లక్షలు, భవన నిర్మాణ కార్మికులకు రూ. 40 వేలు చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహక నగదు అందిస్తోందని తెలిపారు.

రైతులకు అందుబాటులో వ్యవసాయ పరిశోధనలు



అగ్రికల్చర్ ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ వైవీ మురళీకృష్ణ

ఆత్మకూరురూరల్: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయ పరిశోధన కేంద్రాల ఏర్పాటు ద్వారా ప్రభుత్వం వ్యవసాయ పరిశోధనలను రైతులకు అందుబాటులోకి తెచ్చిందని అమరావతి రీజనల్ కోడింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ వైవీ మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ అగ్రికల్చర్ ల్యాబ్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ ల్యాబ్‌లో ఎరువులు, విత్తనాల వ్యాపారులకు అవసరమైన ట్రేడ్ శాంపిల్స్‌ను నామమాత్రపు ధరతో నిర్వహిస్తామని తెలిపారు. రైతులు మండల వ్యవసాయాధికారుల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, తదితరాలను పరీక్షలు చేయించుకోవచ్చని వివరించారు. ఉచితంగా పరిశోధనలు నిర్వహించి ఫలితాలు తెలియజేస్తామన్నారు. అనంతరం సిబ్బందిని పరీక్షల వివరాలు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, ల్యాబ్ ఏఓ చంద్రభాను, ఏఈఓలు భార్గవ్, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి

అనుమసముద్రంపేట: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మౌనిక్‌రెడ్డి అన్నారు. ఏఎస్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రేరణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితం చాలా విలువైనదని, సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని తెలిపారు. సమయాన్ని పెట్టుబడిగా పెట్టినప్పుడే విద్యార్థికి భవిష్యత్తు ఉంటుందన్నారు. మంచి స్నేహాన్ని సంపాదించుకోవాలని సూచించారు. విద్యార్థి 7 నుంచి 10 ఏళ్ల పాటు కొన్నింటిని త్యజించి అనుకున్న ఆశయాలు నెరవేర్చుకోవాలన్నారు. సోమరితనాన్ని విడనాడితో చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, గురువులపై గౌరవం పెంచుకుంటే బంగారు భవిష్యత్తుకు పునాదులు పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌హమీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ



డ్రోన్‌తో పత్తి పంటపై పురుగు మందు పిచికారీని తిలకిస్తున్న రైతులు

చేజర్ల: మండలంలోని గొల్లపల్లి పంచాయతీలో బుధవారం డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేశారు. క్లారియస్ ఇన్నోవేషన్స్ కంపెనీ వారు రైతు ఉడతా హజరత్తయ్య సాగుచేసిన పత్తి పంటపై ప్రయోగాత్మకంగా డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ చేశారు. రాబోయే పంట కాలానికి డ్రోన్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. రైతులు యార్లగడ్డ మాల్యాద్రి, మధు, ఏటూరు చెన్నకేశవులు, పెద్ద పుల్లయ్య,ఏ శరత్‌బాబు, తిరుపతి, ప్రభాకర్, పుల్లయ్య, కొమ్మి రమేష్, బలరామయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్‌ను పగటి పూటే సరఫరా చేయాలి

ఉదయగిరి: రైతులకు పూర్తిగా పగటి పూటే వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలని రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఇటీవల వేకువజామున 4 గంటల నుంచి సరఫరా చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా పగటిపూటే విద్యుత్ ఇవ్వాలని కోరారు.

రోడ్డుకు అడ్డంగా చెట్టు మొదలు

- జేసీబీతో తొలగించిన ఎస్సై

ఆత్మకూరు: పట్టణంలోని బైపాస్ రోడ్డులో చెట్లను తొలగించే క్రమంలో ఓ చెట్టు మొదలును రోడ్డుకు అడ్డంగా పడేశారు. చెట్టు మొదలు దగ్గరికి వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే పరిస్థితి నెలకొంది. బుధవారం ఉదయం వాకర్స్ సమస్యను ఎస్సై ఎం శివశంకర్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. జేసీబీ సాయంతో చెట్టు మొదలును తొలగించారు.